క్లుప్తంగా

వలంటీర్లకు నియామక పత్రాల అందజేత



వలంటీర్లకు నియామక పత్రాలు అందజేస్తున్న కార్పొరేటర్ కోడిగుడ్ల పూర్ణిమ

కంచరపాలెం: జీవీఎంసీ 41వ వార్డు జ్ఞానాపురం సచివాలయంలో శుక్రవారం కొత్తగా ఎంపికైన వలంటీర్లకు కార్పొరేటర్ కోడిగుడ్ల పూర్ణిమ నియామక పత్రాలు అందజేశారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రజలకు అందే రీతిలో వలంటీర్లు పని చేయాలని ఆమె సూచించారు. కార్యక్రమంలో వార్డు సీనియర్ నాయకుడు కోడిగుడ్ల శ్రీధర్, వెళంగిణీరావు, కమల్, శ్యామ్, కుమార్, శ్రీను, అన్నపూర్ణ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

కనకమహాలక్ష్మికి క్షీరాభిషేక సేవ



క్షీరాభిషేక సేవలో సిరులతల్లి

దాబాగార్డెన్స్: బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మికి శుక్రవారం క్షీరాభిషేక సేవ నిర్వహించారు. ఉదయం 8 నుంచి 9 గంటల వరకు నిర్వహించిన ఈ పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. ఈ ప్రత్యేక పూజ ప్రతి శుక్రవారం నిర్వహించనున్నట్టు ఆలయ ఈవో కె. శిరీష తెలిపారు. పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.500 చెల్లించిన యెడల పూజకు దంపతులను లేదా ఇద్దరిని అనుమతించనున్నట్టు చెప్పారు. పై పూజలో పాల్గొనదలిచే భక్తులు 0891-2566514, 2711725 నంబర్లలో సంప్రదించవచ్చు. కార్యక్రమంలో ధర్మకర్తల మండలి చైర్‌పర్సన్ కొల్లి సింహాచలం, ఏఈవో కె. తిరుమలేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

ఎలక్ట్రీషియన్ కోర్సులో ఉచిత శిక్షణ

మహారాణిపేట: నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్ (నేక్)లో అసోసియేట్ ఎలక్ట్రీషియన్ కోర్సులో శిక్షణకు నిరుద్యోగుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు నేక్ అసిస్టెంట్ డైరెక్టర్ ఎస్.వి.ఎస్.ఎస్.రవికుమార్ తెలిపారు. పదో తరగతి చదివిన విద్యార్థులకు మహారాణిపేటలోని నేక్ శిక్షణా కేంద్రంలో నాన్ రెసిడెన్షియల్ పద్ధతిలో శిక్షణ ఇస్తామన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు 79895 72891, 83090 59974కు సంప్రదించాలని సూచించారు.

ఎన్జీజీవోస్ కాలనీలో ఎన్‌సీసీ యూనిట్ ప్రారంభం

సీతంపేట: అక్కయ్యపాలెం ఎన్జీజీవోస్ కాలనీలో జీవీఎంసీ హైస్కూల్‌లో ఎన్‌సీసీ యూనిట్‌ను ఏర్పాటు చేశారు. జీవీఎంసీ అడిషనల్ కమిషనర్ శ్రీనివాసరావు ముఖ్య అతిథిగా యూనిట్ కార్యాలయాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్‌సీసీలో చేరడం వల్ల క్రమశిక్షణ, శరీర ధారుడ్యం, విద్యార్థుల్లో ఐక్యత, సేవాభావం కలుగుతాయన్నారు. పాఠశాలకు ఎన్‌సీసీ యూనిట్ కేటాయించిన ఆర్మీ అధికారి కల్నల్ అజయ్‌కుమార్‌కు అభినందనలు తెలిపారు. పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. ఆర్మీ ఉన్నతాధికారి కల్నల్ అజయ్‌కుమార్, పాఠశాల ఎన్‌సీసీ అధికారి ఎం.ఎస్.వి.విశ్వనాథం అధ్వర్యంలో విద్యార్థులకు రన్నింగ్, పుషప్స్, సిట్అప్స్ ద్వారా శారీరక ధారుడ్యం ఉన్న 50 మంది విద్యార్థులను ఎన్‌సీసీ కేడెట్ శిక్షణకు ఎంపిక చేశారు. నగర పరిధిలో జీవీఎంసీ పాఠశాలల్లో మొదటి సారి ఎన్‌సీసీ యూనిట్ రావడానికి విశేష కృషి చేసిన ఎన్‌సీసీ అధికారి విశ్వనాథాన్ని ఘనంగా సన్మానించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు లక్ష్మీనరస, సుబేదార్ మేజర్ కె.కె.సజీవన్, సీనియర్ ఉపాధ్యాయులు ఆర్.శ్రీనివాసరావు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఫిర్యాదులన్నీ అక్రమ నిర్మాణాలపైనే



ఫిర్యాదులు స్వీకరిస్తున్న పట్టణ ప్రణాళికా అధికారి సునీత

దాబాగార్డెన్స్: జీవీఎంసీ పట్టణ ప్రణాళికా విభాగం ఆధ్వర్యంలో శుక్రవారం జీవీఎంసీలో నిర్వహించిన 'టౌన్‌ప్లానింగ్ ఓపెన్ ఫోరం'లో వచ్చిన ఫిర్యాదులన్నీ అక్రమ నిర్మాణాలు, నిబంధనలకు విరుద్ధంగా జరుగుతున్న నిర్మాణాలపైనే అందాయి. జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్‌వర్మ టౌన్‌ప్లానింగ్ ఫిర్యాదుల కోసం ప్రతి శుక్రవారం ప్రత్యేకంగా టౌన్ ప్లానింగ్ ఓపెన్ ఫోరం కార్యక్రమం నిర్వహిస్తున్న సంగతి తెలిసిందే. ఓపెన్ ఫోరంలో 13 ఫిర్యాదులు వచ్చాయి. జోన్-3 నుంచి ఒకటి, జోన్-5 నుంచి ఆరు, జోన్-6 నుంచి మూడు, జోన్-8 నుంచి మూడు ఫిర్యాదులు అందాయి. పట్టణ ప్రణాళిక అధికారి సునీత ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో డీసీపీ నరేంద్రరెడ్డి, ఏసీపీలు పాల్గొన్నారు.

ఇలా ఫిర్యాదు చేయండి..

జీవీఎంసీ పరిధి 8 జోన్లలో ఎలాంటి అనధికార నిర్మాణాలు జరుగుతున్నా, నిబంధనలు ఉల్లంఘించి భవనాలు నిర్మించినా, భవన నిర్మాణ వ్యర్థాలపైన, టౌన్‌ప్లానింగ్ విభాగంపై ఎలాంటి ఫిర్యాదులు తెలపాలన్నా జీవీఎంసీ టోల్ ఫ్రీ నంబరు 1800 4250 0009కు ఫోన్ చేసి నేరుగా తెలపవచ్చు. అలాగే జీవీఎంసీ టౌన్‌ప్లానింగ్ విభాగం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వాట్సప్ నంబరు 8187897569 నంబరుకు ఫిర్యాదు చేయొచ్చు. ఫిర్యాదులో పూర్తి వివరాలు.. పేరు, డోరు నంబరు, వార్డు నంబరు, చిరునామా.. సమస్యతో కూడిన సమాచారాన్ని వాట్సప్‌కు పంపితే సంబంధిత జోన్ అసిస్టెంట్ సిటీ ప్లానర్ ద్వారా ఉన్నతాధికారులకు నివేదించి, ఆ సమస్యపై సత్వర చర్యలు చేపట్టనున్నారు.

ప్రభుత్వ రంగ సంస్థలను కాపాడుకుందాం



జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద దీక్షలో పాల్గొన్న నాయకులు

సీతమ్మధార : ప్రజలకు అన్ని విధాలా సేవలందించి ఆదుకుంటున్న ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేట్ పరం కాకుండా రక్షించుకోవాలని ఎస్‌టీపీసీ, ఐఎన్‌టీయూసీ నాయకులు పిలుపునిచ్చారు. శుక్రవారం జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా అఖిలపక్ష కార్మిక సంఘాల ఆధ్వర్యంలో జరుగుతున్న నిరాహార దీక్షలు 813వ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ ప్రభుత్వ రంగ సంస్థలు ఏర్పడినప్పటి నుండి ఇప్పటి వరకు లక్షలాది మందికి ఉపాధి కల్పించాయన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణను రద్దు చేసి ఉక్కు నిర్వాసితులకు ఉపాధి కల్పించాలని డిమాండ్ చేశారు. బీజేపీ ప్రభుత్వం ప్రభుత్వరంగ సంస్థలను విదేశీ, స్వదేశీ పెట్టుబడిదారులకు అమ్మేయాలని చూడడం అవివేకమన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్‌టీపీసీ జిల్లా జనరల్ సెక్రటరీ బి.నాగభూషణం, ఐఎన్‌టీయూసీ ఏపీ, తెలంగాణ ఆర్గనైజింగ్ సెక్రటరీ బి.పైడిరాజు, బి.అప్పలనాయుడు, పి.శ్రీను, బుచ్చిబాబు తదితరులు పాల్గొన్నారు.

జాతీయ శిబిరంలో సత్తా చాటిన విద్యార్థినికి అభినందనలు



చక్రికను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ శోభారాణి

దాబాగార్డెన్స్: విశాఖ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల విద్యార్థిని, కళాశాల ఎన్ఎస్ఎస్ వలంటీర్ గొలగాని చక్రిక యాదవ్ జాతీయ సమగ్రత శిబిరాన్ని విజయవంతంగా పూర్తి చేసుకుని విశాఖ వచ్చిన సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్. శోభారాణి శుక్రవారం ఆమెను అభినందించారు. ఈ నెల 9 నుంచి 16 వరకు అస్సాం రాష్ట్రంలోని జోర్హట్‌లో గల కజిరంగ యూనివర్సిటీలో ఈ శిబిరం జరిగింది. ఈ సందర్భంగా కళాశాల వైస్ ప్రిన్సిపాల్ వై. లక్ష్మీ, ఏజీవో డాక్టర్ కె. సుధ, ఎన్ఎస్ఎస్ ప్రొగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ ఏహెచ్‌డీ పుష్పలత, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది అభినందనలు తెలిపారు.

వరాహావతారంలో జగన్నాథుడు



వరాహావతారంలో దర్శనమిచ్చిన స్వామివారు

దాబాగార్డెన్స్: టర్నర్ చౌల్ట్రీలో జగన్నాథస్వామి వరహావతారంలో శుక్రవారం దర్శనమిచ్చారు. నగరం నుంచే గాక ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి భక్తులు తరలి వచ్చి మొక్కులు చెల్లించు కున్నారు. రథయాత్రలో భాగంగా శనివారం జగన్నాథస్వామి నృసింహావతారంలో భక్తులకు దర్శనమివ్వనున్నారు. సాయంత్రం టర్నర్ చౌల్ట్రీ ప్రాంగణంలో శ్రీసాయి కళానికేతన్ రాగిణి కూచిపూడి నృత్య దర్శకురాలు ఎం. పద్మిణి, రాగిణిచే కూచిపూడి నృత్యప్రదర్శన ఏర్పాటు చేసినట్టు ఈవో రాజగోపాల్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం ఉదయం 5 నుంచి 6 గంటల వరకు స్వామికి మేలుకొలుపు, నాదస్వరం, 6 నుంచి 7 గంటల వరకూ నిత్యపూజ, 7 నుంచి 9.30 గంటల వరకు జగన్నాథస్వామి ప్రార్థనా సంఘంచే ప్రార్థనా తరంగిణి, 9.30 నుంచి 10.30 వరకూ సామూహిక లలితా సహస్రనామ పారాయణ, మధ్యాహ్నం 3.30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు సామూహిక భగవద్గీత, విష్ణు సహస్రనామ పారాయణ నిర్వహించారు. మధ్యాహ్నం పెద్ద ఎత్తున అన్నసమారాధన నిర్వహించారు. జగన్నాథస్వామి ఆలయ ఈవో రాజగోపాల్ రెడ్డి పర్యవేక్షణలో ఆలయ అర్చకులు పాణంగిపల్లి జగన్నాథాచార్యులు, పాణంగిపల్లి రంగనాథాచార్యులు, పాణంగిపల్లి కేశవాచార్యులు, యేడిద సురేష బాబు పలువురు అధికారులు పాల్గొన్నారు.

నృత్యకారిణులకు సర్టిఫికెట్ల పంపిణీ

జగన్నాథస్వామి ఉత్సవాల సందర్భంగా శుక్రవారం మయూరి డ్యాన్స్ అకాడమీ విద్యార్థులు ప్రదర్శించిన కూచిపూడి నృత్య ప్రదర్శన ఆకట్టుకుంది. వివిధ సంకీర్తనలకు చిన్నారులు నృత్యం చేసి అందరి మన్ననలు పొందారు. నృత్య ప్రదర్శన చేపట్టిన చిన్నారులకు సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ ఈవో టి. రాజగోపాల్‌రెడ్డి, ఆధ్యాత్మికవేత్త ఎంవీ రాజశేఖర్, నృత్య దర్శకురాలు టి. ఉష, చిన్నారులు పాల్గొన్నారు

మందుబాబులకు జైలు

దొండపర్తి: మద్యం తాగి వాహనాలు నడిపే వారిని కోర్టు శిక్షించింది. వారికి రెండు రోజుల పాటు జైలు శిక్షతో పాటు రూ.300 జరిమానా విధించింది. నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ సీఎం త్రివిక్రమ్‌వర్మ ఆదేశాల మేరకు పోలీసులు నగరంలో డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు విస్తృతంగా చేపడుతున్నారు. ఇదే క్రమంలో మద్యం తాగి వాహనాలు నడిపే వారిని పోలీసులు అదుపులోకి తీసుకుని శుక్రవారం కోర్టులో హాజరు పరిచారు. దీంతో విశాఖ రెండో మెట్రోపాలిటన్ మెజిస్ట్రేట్ మందు బాబులకు జైలుశిక్షతో పాటు, జరిమానా విధించారు. గత ఏడాదిలో మద్యం తాగి వాహనాలు నడిపే వారిని పోలీసులు రెగ్యులర్‌గా కోర్టులో హాజరుపరుస్తున్నారు. దీంతో వారు 2 నుంచి 5 రోజులు జైలు శిక్ష అనుభవించాల్సి వస్తోంది. మద్యం తాగి వాహనాలు నడిపితే ప్రాణాపాయమని, ఇలా చేయడం వల్ల వాహనాలు నడిపే వారితో పాటు ఎదుటి వారికి కూడా ప్రమాదమని హెచ్చరిస్తున్నారు. వాహనాలు నడుపుతున్నపుడు మద్యం మత్తుకు దూరంగా ఉండాలని పోలీసులు సూచిస్తున్నారు.

పలువురికి ఎమ్మెల్యే ఆర్థిక సాయం



ఆర్థిక సాయం చేస్తున్న ఎమ్మెల్యే వాసుపల్లి

దాబాగార్డెన్స్: ప్రజాదర్బార్‌లో అందిన వినతులపై ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ స్పందించి పలువురికి ఆర్థిక సాయం చేశారు. 36వ వార్డు పరిధిలో శుక్రవారం నిర్వహించిన ప్రజాదర్బార్‌లో 30వ వార్డు జాలారిపేటకు చెందిన నేతల దాసు పక్షవాతంతో బాధపడుతున్న దృష్ట్యా మందులు, చికిత్స కోసం రూ.2,500 అందజేశారు. 36వ వార్డు గొల్లవీధికి చెందిన దివ్యాంగురాలు కారి గంగమ్మకు రూ.2,500, ఫొటోగ్రాఫర్ గణేష్ కుమారుడు మనోజ్ స్కూల్ ఫీజు కోసం రూ.5వేలు ఆర్థిక సాయం అందజేశారు. 37వ వార్డు కొత్త జాలారిపేటకు చెందిన 22 ఏళ్ల సాయినాథ్ గత కొద్ది రోజులుగా స్పాండిలోర్టిసిటీస్‌తో బాధపడతున్నాడని, వైఎస్సార్ ఆరోగ్యశ్రీ లేదని, రెండు వారాలకు రూ.24 వేల విలువ గల ఒక ఇంజెక్షన్ 6 నెలల పాటు వేయించాలని వచ్చిన వినతిపై ఎమ్మెల్యే స్పందించి సీఎం క్యాంపు కార్యాలయ అధికారులతో మాట్లాడి సీఎంఆర్ఎఫ్ మంజూరు చేయాలని కోరారు. అలాగే ఇళ్ల స్థలాల హామీపత్రాలు ఇచ్చినప్పటికీ కొన్ని కారణాల వల్ల ఇళ్ల స్థలాలు రాని వారికి మూడో దఫాలో మంజూరు చేయాలని, నిరుద్యోగ యువకులకు జీవీఎంసీ శానిటేషన్ విభాగం, అంగన్‌వాడీ సెంటర్‌లో ఉద్యోగాలు కల్పించాలని, పెన్షన్ల కోరుతూ వినతి పత్రాలు అందాయి. 36వ వార్డు అధ్యక్షుడు మాసిపోగు రాజు, మూలే రామిరెడ్డి, దశమంతుల మాణిక్యాలరావు, ముజీబ్‌ఖాన్, బోని దేవా, ఆదివిష్ణు, దశమంతుల చిన్ని, కడియం ప్రసాద్, అడపా శివా, సుధాకర్, వడ్డాది దిలీప్, పాటోజి నాని, ఆరుగుల రాజు, రామరాజు, చింతకాయల వాసు, అచ్యుత్ తదితరులు పాల్గొన్నారు.

నాపల్లి డ్యాన్సింగ్ సూపర్‌స్టార్ గ్రాండ్ ఫినాలే నేడు

సీతంపేట: నాపల్లి డ్యాన్సింగ్ సూపర్‌స్టార్ సీజన్ 6 గ్రాండ్ ఫినాలే పోటీలు శనివారం సాయంత్రం 4 గంటల నుంచి గురజాడ కళాక్షేత్రంలో జరుగుతాయని నిర్వాహకుడు పేస్ క్రియేటర్స్ డ్యాన్స్ అకాడమీ రంజన్‌నాయక్ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రముఖ బాలీవుడ్ కొరియోగ్రాఫర్ ధర్మేష, రాష్ట్ర మంత్రి సీదిరి అప్పలరాజు, దక్షిణ నియోజకవర్గ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ ముఖ్య అతిథులుగా హాజరుకానున్నట్టు చెప్పారు. ఈ పోటీలకు ఇండియన్ హిప్‌హాప్ ఇంటర్నేషనల్ విన్నర్స్ సాగర్, బోరా, కార్తీక్ రాజా, రవివర్మ, దీపక్ రాజ్‌పుత్ న్యాయ నిర్ణేతలుగా వ్యవహరిస్తారన్నారు. మొదటి బహుమతిగా రూ.1 లక్ష, ద్వితీయ బహుమతిగా రూ.50 వేలు, తృతీయ బహుమతిగా రూ.25 వేలు అతిథుల చేతుల మీదుగా అందజేస్తామని తెలిపారు. ఆరోగ్యకరమైన మిల్లెట్ స్నాక్స్ అందుబాటులోకి తెచ్చిన గంధం ఫుడ్స్ నాపల్లి ఈ ఈవెంట్‌కు ప్రధాన స్పాన్సర్‌గా వ్యవహరిస్తున్నారని పేర్కొన్నారు. యువత పెద్ద ఎత్తున హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని రంజన్‌నాయక్ కోరారు.

జాబ్ మేళాకు విశేష స్పందన

కంచరపాలెం: స్థానిక జిల్లా ఉపాధి కార్యాలయం నేషనల్ కెరీర్ సర్వీస్ సెంటర్‌లో ఆంధ్రప్రదేశ్ డిపార్ట్‌మెంట్ ఆఫ్ స్కిల్ డెవలప్‌మెంట్ అండ్ ట్రైనింగ్ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన మెగా జాబ్ మేళాకు విశేష స్పందన లభించింది. డబ్ల్యూఎస్ఎస్ గ్లోబల్ సర్వీసెస్, సోలార్ ఎనర్జీ హోల్డింగ్స్, త్రీఎస్ బిజినెస్ ఇన్ఫో సర్వీసెస్, టీం లీజ్ యూనియన్ బ్యాంక్, ఆటోమోటివ్, వరుణ్ మోటర్స్, యాక్సిస్ బ్యాంక్, అపోలో ఫార్మసీ, పలు ప్రైవేటు లిమిటెడ్ కంపెనీల్లో 715 ఉద్యోగాలకు జరిగిన ఇంటర్వ్యూలకు 569 మంది అభ్యర్థులు హాజరైతే 428 మంది ఎంపికైనట్లు సంస్థ ప్రతినిధులు తెలిపారు. ఎంపికైన అభ్యర్థుల సర్టిఫికెట్లను వారు పరిశీలించారు. అభ్యర్థులకు జిల్లా ఎంప్లాయిమెంట్ అధికారులు సి.హెచ్.సుబ్బిరెడ్డి, ఎ.సంగీత చేతుల మీదుగా నియామక పత్రాలు అందజేశారు. రాష్ట్ర ప్రభుత్వం పలు ప్రైవేటు కంపెనీలను ప్రోత్సహించడంతో ఆయా కంపెనీలు నేరుగా నిరుద్యోగులకు ఉద్యోగావకాశాలు కల్పిస్తున్నాయని సుబ్బిరెడ్డి తెలిపారు. అభ్యర్థులు ఆనందం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఆయా సంస్థ ప్రతినిధులు, ఎంప్లాయిమెంట్ సిబ్బంది పాల్గొన్నారు.

పిల్లలకు ప్రత్యేక ఏర్పాట్లపై కమీషన్ సంతృప్తి



పిల్లలకు వేడిపాలు, బిస్కెట్లు పంపిణీ చేస్తున్న గొండు సీతారాం. చిత్రంలో ఈవో రాజగోపాల్‌రెడ్డి

మహారాణిపేట : జగన్నాథ రథయాత్ర ఉత్సవాల్లో భాగంగా బాలలకు ప్రత్యేకంగా చేసిన ఏర్పాట్లను ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమీషన్ సభ్యుడు గొండు సీతారాం శుక్రవారం పరిశీలించారు. అనంతరం క్యూ లైన్లలో వచ్చే పిల్లలకు దేవస్థానం ఏర్పాటు చేసిన వేడి పాలు, బిస్కెట్ల పంపిణీని ఆయన ప్రారంభించారు. అనంతరం చంటి బిడ్డలతో హాజరయ్యే తల్లులకు, ఐదేళ్లలోపు బాలలు, దివ్యాంగులకు ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన క్యూలైన్లను పరిశీలించారు. చంటి పిల్లలకు తల్లులు పాలు పట్టే ప్రత్యేక కేంద్రాల ఏర్పాటుపై ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు. 1098 చైల్డ్‌లైన్ అందిస్తున్న సేవలపై ఆరా తీశారు. ఉత్సవ ఏర్పాట్లపై బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యులు సూచించిన అంశాలను పరిగణనలోకి తీసుకుని ఏర్పాట్లు చేయడం హర్షణీయమన్నారు. ఉత్సవాల ముగింపు వరకు అన్ని శాఖల సమన్వయంతో దర్శనాలకు వచ్చే బాలలకు ప్రత్యేక దృష్టితో సేవలందించాలని సూచించారు. జగన్నాథస్వామి ఆలయ ఈవో రాజగోపాల్‌రెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమీషన్ ఆదేశాలు, కలెక్టర్ సూచనలు, అధికార యంత్రాంగం సమన్వయంతో పిల్లలకు ఎటువంటి ఇబ్బంది లేకుండా ఉత్సవాలు పరిసమాప్తి చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం ప్రధాన అర్చకులు జగన్నాథ ఆచార్యులు, స్త్రీ, శిశు సంక్షేమ శాఖ అధికారులు, సచివాలయ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

డాక్టర్ శ్యాంప్రసాద్ ముఖర్జీకి ఘన నివాళి



డాక్టర్ శ్యాంప్రసాద్ ముఖర్జీకి నివాళి అర్పిస్తున్న డాక్టర్ లక్ష్మీనారాయణ తదితరులు

మహారాణిపేట : బీజేపీ వైద్య విభాగం, శ్రీ గాయత్రి వెల్ఫేర్ కల్చరల్ యూత్ అకాడమీ సంయుక్త ఆధ్వర్యంలో శుక్రవారం 29వ వార్డు ప్రకృతి చికిత్సాలయం ఆవరణలో భారతీయ జన్‌సంఘ్ వ్యవస్థాపకుడు శ్యాంప్రసాద్ ముఖర్జీ వర్ధంతి నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న డాక్టర్ ఎస్. లక్ష్మీనారాయణ ముందుగా శ్యాంప్రసాద్ ముఖర్జీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ముఖర్జీ చిన్నతనం నుంచే విద్య పట్ల ఆకర్షితులై ఉన్నత విద్యని అభ్యసించారని అన్నారు. వీరు అఖిల భారతీయ దేశ తొలి ప్రధాని నెహ్రూ మంత్రివర్గంలో పారిశ్రామిక శాఖ మంత్రిగా బాధ్యతలు చేపట్టి తనదైన శైలిలో ముద్ర వేశారని అన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ ఏపీ రాష్ట్ర వైద్య విభాగం కన్వీనర్ రూపాకుల రవికుమార్, డాక్టర్ ఎస్. శ్రీలక్ష్మి, నగర బీజేపీ ఉపాధ్యక్షుడు చొక్కాకుల రాంబాబు, టి. గిరిజ, మహారాణిపేట మండల బీజేపీ అధ్యక్షుడు చంద్రశేఖరరావు, మైనార్టీమోర్చా రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు సీహెచ్ రాజబాబు, ప్రతినిధులు గేదెల శ్రీహరి, గౌరీ శంకర్, రాంజీ, గేదెల రాము, కొండమ్మ, ఎ. రమణ, మంగ, బంగారమ్మ పాల్గొన్నారు.

కంప్యూటర్ డెస్క్ టాప్ వితరణ



కంప్యూటర్ డెస్క్‌టాప్‌ను అందజేస్తున్న అతిథులు

అల్లిపురం: వాసవీ క్లబ్ అల్లిపురం ఆధ్వర్యంలో జరిగిన సేవా కార్యక్రమాల్లో పావని మల్టిపుల్ హ్యాండీ క్యాప్డ్ అండ్ స్పెస్టిక్స్ ఇనిస్టిట్యూట్ (మానసిక, మూగ, బధిర వికలాంగుల గృహం)కు రూ. 26 వేలు విలువ గల కంప్యూటర్ డెస్క్ టాప్‌ను క్లబ్ ఇంటర్నేషనల్ జిల్లా గవర్నర్ డాక్టర్ కందుల నాగరాజు అందజేశారు. క్లబ్ మాజీ అధ్యక్షుడు చీమకుర్తి విఠల్‌కుమార్, కాంచన దంపతుల ఆర్థిక సహాయంతో దీనిని అందజేశారు. ఈ కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు డీవీఎస్ఎన్ రాజు, కార్యదర్శి బీవీఎల్ కుమార్, కోశాధికారి పీవీఎస్ఆర్ గుప్తా, క్యాబినెట్ సెక్రటరీ ఎస్.మహేశ్వరరావు, క్యాబినెట్ ట్రెజరర్ ముక్కు శ్రీనివాసరావు, జిల్లా వైస్ గవర్నర్ అడ్డగళ్ల గుప్త, రీజనల్ చైర్ పర్సన్ వరిగాల పండు, రీజనల్ సెక్రటరీ కందుల మధుబాబు, ఉపాధ్యక్షుడు సలాది సుబ్రహ్మణ్యం, దాసు ఆదినారాయణ (అనిల్) తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా వారాహి అమ్మవారి నవరాత్రి ఉత్సవాలు

- నేడు శ్వేత వారాహి అవతారంలో అమ్మవారి దర్శనం



శ్వేత వారాహి అవతారంలో వారాహిదేవి

అల్లిపురం: బంగారుమెట్ట షిర్డీసాయి దర్బార్‌లో వెలసిన అనఘాలక్ష్మి అమ్మవారి దేవాలయంలో వారాహి నవరాత్రులు గత నాలుగు రోజులుగా వైభవంగా నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా అమ్మవారు ప్రతి రోజు ఒక ప్రత్యేక అవతారం, అలంకరణలో భక్తులకు దర్శనమిస్తున్నారు. ఈ నేపథ్యంలో అమ్మవారు శుక్రవారం శ్వేత వారాహి అవతారంలో దర్శనమిచ్చారు. అమ్మవారికి పరమాన్నం నైవేద్యం పెట్టి, ఉప్పు దీపంతో పూజించారు. కాయగూరలు, ఆకు కూరలతో భక్తులు అమ్మవారిని అలంకరించారు.

నేడు ధూమ్ర వారాహి అవతారం..

నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా అమ్మవారు శనివారం ధూమ్ర వారాహి అవతారంలో భక్తులకు దర్శనమివ్వనున్నారు.

పోలీసుల అదుపులో ఫేక్ ఐడీ తయారీ ముఠా

అల్లిపురం: వేర్వేరు కేసుల్లో అరెస్ట్ అయిన నిందితులకు బెయిల్ ఇచ్చే వ్యక్తులకు ఫేక్ ఐడీలు, ఆధార్ కార్డులు సృష్టించి వేలకు వేలు దండుకుంటున్న ముఠాను నగర టాస్క్‌ఫోర్సు పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మహారాణిపేట పరిధి తాడివీధిలో లక్ష్మి అనే మహిళ సహా నలుగురు వ్యక్తులు బెయిల్, పూచీకత్తుల కోసం ప్రయత్నించే వారే లక్ష్యంగా ఫేక్ ఐడీలు, డాక్యుమెంట్లు తయారు చేసి వేలాది రూపాయలు వసూలు చేస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. ఈ ముఠాను నగర టాస్క్‌ఫోర్సు పోలీసులు గురువారం రాత్రి అదుపులోకి తీసుకుని మహారాణిపేట పోలీసులకు అప్పగించారు. వారి వద్ద నుంచి కంప్యూటర్, స్కానర్, ప్రింటర్ స్వాధీనం చేసుకున్నారు. ప్రధాన నిందితుడు విజయవాడలో ఉన్నట్లు గుర్తించిన పోలీసుల బృందం ఒకటి అక్కడికి వెళ్లినట్లు తెలిపారు. కేసు దర్యాప్తులో ఉందని ఇంకా ఎంత మంది ఉన్నదీ తెలియాల్సి ఉందని పేర్కొన్నారు.

జగనన్న సురక్షకు మండల స్పెషల్ ఆఫీసర్లు

దొండపర్తి: జగనన్న సురక్ష పర్యవేక్షణకు మండల స్పెషల్ ఆఫీసర్ల (ఎంఎస్‌వో)ను నియమించారు. ఈ మేరకు కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున ఉత్తర్వులు జారీ చేశారు. జిల్లాలో 11 మండలాల్లో జగనన్న సురక్ష కార్యక్రమం సక్రమంగా అమలయ్యే విధంగా 11 మంది ఎంఎస్‌వోలు పర్యవేక్షించనున్నారు. పద్మనాభంకు ఎన్‌హెచ్-16 స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ (ఎల్‌ఏ), భీమునిపట్నంకు ఆ డివిజన్ ఆర్డీవో, ఆనందపురానికి స్పెషల్ డిప్యూటీ కలెక్టర్(కేఆర్‌ఆర్‌సీ), విశాఖ రూరల్‌కు స్టీల్‌ప్లాంట్ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్(ఎల్‌ఏ), సీతమ్మధారకు జీవీఎంసీ శానిటేషన్ అండ్ రెవెన్యూ అడిషినల్ కమిషనర్, మహారాణిపేటకు జీవీఎంసీ ఏడీసీ జనరల్‌ను నియమించారు. అలాగే గోపాలపట్నంకు జీవీఎంసీ యూసీడీ పీడీ, ములగాడకు జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి, గాజువాకకు వీఎంఆర్‌డీఏ ఎస్టేట్ ఆఫీసర్, పెదగంట్యాడకు జిల్లా సహకార శాఖాధికారి, పెందుర్తికి డీఆర్‌డీఏ పీడీకి బాధ్యతలు అప్పగించారు.

హస్త కళలను ప్రోత్సహించడం మన బాధ్యత

పీఎం పాలెం: భారతీయ సంప్రదాయ హస్త కళాకారులు తయారు చేసిన ఉత్పత్తులను ఆదరించాలని ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు అన్నారు. శిల్పారామంలో ఏర్పాటు చేసిన అఖిల భారత హస్తకళల ప్రదర్శన- విక్రయాల స్టాల్స్‌ను ఆయన శుక్రవారం ప్రారంభించారు. చేతితో తయారు చేసిన ఉత్పత్తులను కొనుగోలు చేయడం ద్వారా వారిని ప్రోత్సహించాలని ఎమ్మెల్యే పిలుపు ఇచ్చారు. స్టాల్స్ నిర్వాహక ప్రతినిధి మాట్లాడుతూ శిల్పారామంలో ఏర్పాటు చేసిన 60 స్టాల్స్‌లో దేశంలోని 20 రాష్ట్రాల్లో తయారైయిన హస్తకళల ఉత్పత్తులు ప్రదర్శిస్తున్నట్టు చెప్పారు.

పలు రైళ్ల రద్దు, మరికొన్ని గమ్యం కుదింపు

తాటిచెట్లపాలెం: ఖరగ్‌పూర్ డివిజన్ పరిధిలో జరుగుతున్న పనుల కారణంగా పలు రైళ్లను రద్దు చేసినట్లు వాల్తేర్ డివిజన్ అధికారులు తెలిపారు. ఈ నెల 24న హౌరా-తిరుపతి (22889) ఎక్స్‌ప్రెస్, హౌరా-ఎర్నాకుళం (22877) ఎక్స్‌ప్రెస్, ఈ నెల 24, 25వ తేదీల్లో షాలిమార్-హైదరాబాద్ (18045) ఈస్ట్ కోస్ట్ ఎక్స్‌ప్రెస్, హైదరాబాద్-షాలిమార్ (18046) ఈస్ట్‌కోస్ట్ ఎక్స్‌ప్రెస్, ఈ నెల 25న సంత్రగచ్చి-మంగుళూరు (22855) ఎక్స్‌ప్రెస్, హౌరా-పుదుచ్చేరి (12867) ఎక్స్‌ప్రెస్, తిరుపతి- హౌరా (22890) హమ్‌సఫర్ ఎక్స్‌ప్రెస్, ఈ నెల 26న సికింద్రాబాద్-అగర్తలా (07030) ఎక్స్‌ప్రెస్‌లను రద్దు చేశారు.

- వాల్తేర్ డివిజన్ కేకే లైన్ పరిధిలో భద్రతా కారణాల వలన ఈ మార్గంలో ప్రయాణించే పలు రైళ్లను ఆయా తేదీల్లో గమ్యం కుదిస్తున్నట్లు అధికారులు వెల్లడించారు. విశాఖపట్నం-కిరండూల్ (18514) నైట్ ఎక్స్‌ప్రెస్ ఈ నెల 25 నుంచి జూలై 1వ తేదీ వరకు దంతేవాడ వరకు మాత్రమే నడుస్తుంది. కిరండూల్-విశాఖ (18513) నైట్ ఎక్స్‌ప్రెస్ ఈ నెల 26 నుంచి జూలై 2వ తేదీ వరకు దంతేవాడ నుంచి బయలుదేరి విశాఖ చేరుకుంటుంది.
- విశాఖపట్నం-కిరండూల్ (08551) పాసింజర్ స్పెషల్ ఈ నెల 25 నుంచి జూలై 2వ తేదీ వరకు దంతేవాడ వరకు మాత్రమే నడుస్తుంది. కిరండూల్-విశాఖపట్నం(08552) పాసింజర్ స్పెషల్ ఈ నెల 26 నుంచి జూలై 3వ తేదీ వరకు దంతేవాడ నుంచి బయలుదేరి విశాఖపట్నం చేరుకుంటుంది.

డ్రగ్స్ నివారణకు సమష్టిగా పని చేయాలి



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సీపీ త్రివిక్రమ్‌వర్మ తదితరులు

దొండపర్తి : మాదక ద్రవ్యాల నియంత్రణకు అన్ని వ్యవస్థలు సమష్టిగా పని చేయాలని నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ సీఎం త్రివిక్రమ్ వర్మ సూచించారు. డ్రగ్ ఫ్రీ అవగాహన కార్యక్రమ పోస్టర్‌ను సీపీ శుక్రవారం తన కార్యాలయంలో ఎస్ఈబీ అధికారులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మత్తు పదార్థాల నివారణలో స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో సమర్థవంతంగా కృషి చేస్తోందని పేర్కొన్నారు. సాయంత్రం వేళల్లో దాడులు పెంచడం ద్వారా మత్తు పదార్థాల వినియోగాన్ని అరికట్టే విధంగా మరింత సమర్థవంతంగా పని చేయాలని ఎస్ఈబీ అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో సెబ్ డిప్యూటీ కమిషనర్ బాబ్జీరావు, జాయింట్ డైరెక్టర్ బమ్మిడి శ్రీనివాసరావు, ఏఈఎస్ బి.శ్రీనాథుడు, ఇతర అధికారులు పాల్గొన్నారు.